క్లుప్తంగా

ఉమా చంద్రమౌళీశ్వరస్వామికి అభిషేకాలు


ఉమాచంద్రమౌళీశ్వరస్వామి

సింహాచలం: అడవివరం దరి విజినిగిరిపాలెంలోని ఉమా చంద్రమౌళీశ్వరస్వామి ఆలయంలో సోమవారం పరమేశ్వరుడికి విశేషంగా అభిషేకాలు, పూజలు నిర్వహించారు. భక్తులు స్వామికి బిల్వపత్రాలతో పూజలు చేశారు. మహిళలు ఉమాదేవి అమ్మవారికి కుంకుమ పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు ద్వాదశి సోదరులు, ఉదయ్‌కృష్ణశర్మ ఆధ్వర్యంలో ఈ పూజలు జరిగాయి.

నేడు పోలిపిల్లిమ్మ పండగ


పోలిపిల్లిమ్మ

సింహాచలం: జీవీఎంసీ 98వ వార్డు అప్పన్నపాలెంలో కొలువైన పోలిపిల్లిమ్మ వార్షిక పండగను మంగళవారం వైభవంగా నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ అధ్యక్షుడు పీతల విష్ణుమూర్తి తెలిపారు. భక్తులంతా అమ్మవారిని దర్శించుకుని ఆశీస్సులు పొందాలని కోరారు. రాత్రి అనుపు మహోత్సవంలో భాగంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ఆలయాన్ని విద్యుత్ దీపాలతో ముస్తాబు చేశారు.

లక్ష్మీనారాయణస్వామికి బంగారు కవచం బహూకరణ


ఈవోకు కవచం అందజేస్తున్న దాత

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో కొలువుదీరిన లక్ష్మీనారాయణస్వామికి బంగారు కవచాన్ని నగరంలోని మురళీనగర్ ప్రాంతానికి చెందిన జయశ్రీ అనేదాత దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తికి అందజేశారు. అలాగే ఒక అజ్ఞాత భక్తురాలు శ్రీదేవి, భూదేవి అమ్మవార్లకు బంగారు మంగళ సూత్రాలు కానుకగా అందజేశారు.

90 మద్యం సీసాల స్వాధీనం


కన్నూరు వద్ద స్వాధీనం చేసుకున్న మద్యం సీసాలు

పరవాడ: లంకెలపాలెం ప్రాంతంలో ఓ ప్రభుత్వ మద్యం దుకాణం నుంచి సబ్బవరం మండలం అమృతపురం గ్రామానికి చెందిన వ్యక్తి అక్రమంగా తరలిస్తున్న 90 మద్యం సీసాలను సీఐ ఎస్.బాలసూర్యారావు సోమవారం కన్నూరు గ్రామం వద్ద స్వాధీనం చేసుకున్నారు. అమృతపురం గ్రామానికి చెందిన గండి సత్తిబాబుపై కేసు నమోదు చేశామని సీఐ బాలసూర్యారావు చెప్పారు. ఈ దాడిలో ఎస్‌ఐ టి.మల్లేశ్వరరావు, హెడ్‌కానిస్టేబుల్ శ్రీనివాసరావు సిబ్బంది పాల్గొన్నారు.

మద్యం మత్తులో కింద పడి వ్యక్తి మృతి

కూర్మన్నపాలెం: మద్యం మత్తులో కాలువ దాటుతున్న ఓ వ్యక్తి సిమెంట్ కాంక్రీట్ రాళ్లపై పడి మృతి చెందిన ఘటన దువ్వాడ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. దువ్వాడ పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. అనకాపల్లిలోని లారీ యార్డులో డ్రైవర్‌గా పని చేస్తున్న కసిరెడ్డి సంతోష్ (30) భార్య గౌరి, కుమార్తెతో కలిసి అనకాపల్లి జిల్లా సబ్బవరం మండలం, పెద్ద గొల్లలపాలెం గ్రామంలో నివసిస్తున్నారు. ఆదివారం రాత్రి కూర్మన్నపాలెం దరి దువ్వాడ బ్రిడ్జి వైపు వచ్చే రోడ్డు టర్నింగ్ వద్ద నడుచుకుంటూ వస్తున్న సంతోష్ కాలువ దాటుతుండగా అక్కడున్న సిమెంట్ కాంక్రీట్ రాళ్లపై పడి మృతి చెందాడు. సమీపంలోని ఓ చిరు వ్యాపారి గమనించి, పోలీసులకు సమాచారం ఇవ్వడంతో దువ్వాడ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతుడు సంతోష్ ఫోన్ నుంచి అతని కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. సంతోష్ భార్య గౌరి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.



అందరివాడు అందనివాడు



- ప్రజలకు చేరువగా ఎమ్మెల్యే అదీప్‌రాజ్
- కోవిడ్ సమయంలో భారీస్థాయిలో వితరణ
- నిత్యం ప్రజలతో మమేకం.. సమస్యల పరిష్కారం
- 2014 నుంచి పెందుర్తి వైపు చూడని పంచకర్ల
- నియోజకవర్గాలు, పార్టీలు మారుతున్న వలసపక్షి
- కోవిడ్‌లో సైతం పెందుర్తి వైపు చూడని కూటమి అభ్యర్థి

పెందుర్తి: పెందుర్తి నియోజకవర్గం..ఎందరో రాజకీయ ఉద్దండులను అందించిన ప్రాంతం. రాజీ లేని రాజకీయాలకు పెట్టింది పేరు. దొడ్డిదారిలో కాకుండా ప్రజాక్షేత్రంలోనే పోరాటాలు చేస్తూ ఎదిగిన నేతలు పుట్టి నగడ్డ. తమ వెన్నంటి ఉన్నవారిని ప్రజలు ఆదరిస్తారు. ఆ విషయంలో వైఎస్సార్‌సీపీ అభ్యర్థి, ప్రస్తుత అన్నంరెడ్డి అన్నంరెడ్డి అదీప్‌రాజ్ ముందు వరుసలో ఉంటారని పెందుర్తి జనం కీర్తిస్తున్నారు.ఎమ్మెల్యేగా ఉన్న అదీప్‌రాజ్ నిరంతరం ప్రజలతోనే ఉన్నారు. ప్రజా సమస్యలు పరిష్కరించడంతో పాటు పార్టీలకు అతీతంగా నియోజకవర్గ వాసులకు సంక్షేమ ఫలాలు అందేలా ప్రత్యేక శ్రద్ధ చూపారు. కోవిడ్ లాంటి విపత్కర పరిస్థితిలో నేనున్నాంటూ ప్రజలకు ఎమ్మెల్యే అదీప్‌రాజ్ భరోసా కల్పించారు. ఆ కష్టకాలంలో కోట్లాది రూపాయలతో సరుకులు, ఇతర అవసరాలు తీర్చారు. సమస్య ఉన్నవారికి నేనున్నానంటూ తోడుంటూ..అందరూ నా వారే అనుకుని 'అన్నం'పెట్టే యువనేతగా గుర్తింపు అదీప్‌రాజ్ గుర్తింపు పొందారు.




కోవిడ్ సమయంలో నిత్యావసర సరకులు పంపిణీ చేస్తున్న అదీప్‌రాజ్ (ఫైల్)

ప్రజల్లో ఎదిగి.. ప్రజాసేవలో ఒదిగి..

- ప్రస్తుత ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ అభ్యర్థి అన్నంరెడ్డి అదీప్‌రాజ్ 21 ఏళ్లకే సర్పంచ్‌గా రాజకీయ ఆరంగేట్రం చేశారు.
- పిన్న వయసులో సర్పంచ్‌గా ఎన్నికైన వెంటనే 70 మంది నిరుపేదలకు తన సొంత నిధులతో ఇళ్లు కట్టించి అందజేశారు.
- సరిగ్గా తొమ్మిదేళ్ల కిందట పెందుర్తి వైఎస్సార్‌సీపీ పెందుర్తి నియోజకవర్గ పార్టీ బాధ్యతలు చేపట్టారు. అప్పటికే ప్రజాక్షేత్రంలో చురుగ్గా ఉన్న అదీప్‌రాజ్ వైఎస్సార్‌సీపీ పగ్గాలు అందుకోగానే వెనుదిరిగి చూడలేదు. సీనియర్లు, జూనియర్లను కలుపుకుంటూ సమన్వయంతో పార్టీని సమర్థవంతంగా నడిపారు. తమది ప్రజల కోసం పుట్టిన పార్టీ అని నిరూపిస్తూ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పోరాటస్ఫూర్తితో అనుక్షణం ప్రజా సమస్యలపైనే పోరాడి నాయకుడిగా రాటుదేలారు.
- ప్రజలకు సామాజికంగా, వ్యక్తిగతంగా ఏ కష్టం వచ్చినా వెంటనే ఆదుకునే తత్వాన్ని అలవరుచుకున్న అదీప్‌రాజ్.. 2019 ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ తరఫున బరిలో నిలిచి దాదాపు 30 వేల భారీ మెజారిటీతో ఘన విజయం సాధించారు.
- అధికారంలోకి వచ్చిన తర్వాత అదీప్‌రాజ్ ప్రజలకు మరింత చేరువయ్యారు. సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనుల బాధ్యతలను భుజానెత్తుకుని ముందుకు సాగారు.
- గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా నియోజకవర్గంలోని ప్రతీ ఇంటికి వెళ్లి సమస్యల గురించి ఆరా తీశారు. ఎలాంటి సమస్య అయినా తక్షణమే దానిపై స్పందించి సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కారానికి కృషి చేశారు.
- అదీప్‌రాజ్ చొరవతో రికార్డు స్థాయిలో నియోజకవర్గంలో 33 వేల మందికి ఇళ్ల స్థలాలు, ఇళ్లు మంజూరు చేయించారు.
- ముఖ్యంగా కోవిడ్ కష్టకాలంలో ప్రజలు ఇంటి నుంచి బయటకు రాలేని సమయంలో నియోజకవర్గంలోని నిరుపేదలకు ఎమ్మెల్యే అదీప్‌రాజ్ ఎంతో అండగా నిలిచారు. ప్రభుత్వం నుంచి అందిన సహాయంతో పాటు తన సొంత నిధులు రూ.2 కోట్లకు పైగా వెచ్చించి నిరుపేదలకు నిత్యావసరాలు, మందులు అందించారు. అంబులెన్స్‌లు ఏర్పాటు చేసి కోవిడ్ బాధితులను ఆస్పత్రులకు తరలించారు. ప్రతిపక్షంలో ఉన్న ఐదేళ్లు..అధికారంలో ఉన్న ఐదేళ్లు స్థానికంగానే ఉంటూ ప్రజలకు సేవలందించిన అదీప్‌రాజ్ ప్రజాప్రతినిధిగా కొనసాగితే మరింత ఉన్నతంగా సేవలందిస్తారని ప్రజలు విశ్వాసం వ్యక్తం చేస్తున్నారు.


కోవిడ్ కేర్ సెంటర్‌లో ఉన్న వారిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్ (ఫైల్)

వలస పక్షి కూటమి అభ్యర్థి పంచకర్ల

- టీడీపీ–జనసేన–బీజేపీ కూటమి అభ్యర్థిగా ఇక్కడకు మరోసారి వలస వచ్చిన పంచకర్ల రమేష్‌బాబు గతంలో పెందుర్తి ఎమ్మెల్యేగా వెలగబెట్టి..ఆ తర్వాత రాజకీయ భిక్ష పెట్టిన పెందుర్తి ప్రజలను గాలికి వదిలేశారు. కోవిడ్ లాంటి కష్టకాలంలో ఇటువైపు కనీసం కన్నెత్తి చూడలేదు. అలాంటి పంచకర్ల నేనే అంతా చేశానంటూ గాలి కబుర్లు చెప్పడంపై ప్రజలు మండిపడుతున్నారు.
- రాజకీయ భిక్ష పెట్టిన ప్రజలకే వెన్నుపోటు పొడిచి మళ్లీ వచ్చాడని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.
- పదవుల కోసం పాకులాడే వ్యక్తి పంచకర్ల రమేష్‌బాబు అని జిల్లాలో నానుడి. రాజకీయంగా కనీస విలువలు పాటించకుండా పదవి వస్తుంది అంటే చొక్కా మార్చినంత సులువుగా పార్టీలు మార్చేస్తుంటారు పంచకర్ల. 2009 వరకు వ్యాపారాల్లో ఉన్న రమేష్‌బాబు అప్పటి సార్వత్రిక ఎన్నికల్లో ప్రజారాజ్యం తరఫున పెందుర్తిలో పోటీలో నిలబడ్డారు. కొత్త పార్టీ, కొత్త ముఖం..పైగా త్రిముఖ పోటీ కావడంతో రమేష్‌బాబు ఆ ఎన్నికల్లో గెలుపొందారు.
- అయితే కొంతకాలానికే ప్రజారాజ్యం పార్టీని రోశయ్య ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో కాంగ్రెస్‌లోకి విలీనం చేసిన తర్వాత పంచకర్ల అధికార(కాంగ్రెస్) పార్టీ ఎమ్మెల్యేగా అవతారం ఎత్తారు. 2014 ఎన్నికల వరకు పంచకర్ల అనుచరులు పెందుర్తిలో ఆడిందే ఆట..పాడిందే పాటగా సాగింది. అప్పటి వరకు ప్రశాంతంగా ఉన్న పెందుర్తిలో భూ ఆక్రమణలు, దౌర్జన్యాలకు ఆజ్యం పోసింది పంచకర్ల, అతని అనుచరులే అని నియోజకవర్గ ప్రజల మాట.

2014లో కాంగ్రెస్‌కు గుడ్‌బై..

- రాష్ట్ర విభజన తర్వాత 2014లో జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్‌కు గుడ్‌బై చెప్పిన పంచకర్ల టీడీపీ జెండా పట్టుకుని పెందుర్తి నుంచి యలమంచిలికి ఎగిరిపోయారు.
- 2014లో టీడీపీ అధికారంలోకి రావడంతో నీరు–చెట్టు, ఇరత ప్రభుత్వ పథకాలతో పాటు యలమంచిలి ప్రాంతంలోని ప్రభుత్వ భూములను కొల్లగొట్టారనే ఆరోపణలు పంచకర్ల, అతని బ్యాచ్‌పై ఉన్నాయి.
- 2019లో అక్కడి నుంచే పోటీ చేసిన పంచకర్లకు యలమంచిలి ప్రజలు తగిన బుద్ధి చెప్పారు. దీంతో కొన్నాళ్లు స్తబ్దుగా ఉన్న రమేష్‌బాబు రెండేళ్ల కిందట వైఎస్సార్‌సీపీలో చేరారు. పార్టీ అతడిని గౌరవించి జిల్లా అధ్యక్షుడి పదవి ఇస్తే కొన్నాళ్లకే పార్టీని వీడి జనసేనలో చేరారు.
- ఇలా పదేళ్లలో ఐదోసారి పార్టీ..మూడోసారి నియోజకవర్గం మారిన పంచకర్ల తిరిగి పెందుర్తిలో వాలారు. టీడీపీ–జనసేన–బీజేపీ నుంచి టికెట్ ఖాయం అనుకున్న టీడీపీ సీనియర్ నేత బండారు సత్యనారాయణమూర్తికి చెక్ పెట్టి టికెట్ 'కొనుక్కొచ్చారు'. అయితే రాజకీయ భిక్ష పెట్టిన పెందుర్తి వైపు కోవిడ్ లాంటి విపత్కర పరిస్థితిలో పట్టించుకోని రమేష్‌బాబును ప్రజలు నమ్మే స్థితిలో లేరని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు.

భక్తిశ్రద్ధలతో అంజన్న విగ్రహ ప్రతిష్ట


ఆంజనేయస్వామిని దర్శించుకున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్, నాయకులు

పరవాడ: దేశపాత్రునిపాలెం గ్రామంలో నూతనంగా నిర్మించిన అభయ సీతారామ, లక్ష్మణ, ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం సోమవారం కనుల పండువగా జరిగింది. కార్యక్రమంలో ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ పాల్గొని సీతారామ, లక్ష్మణ, ఆంజనేయ స్వాములకు ప్రత్యేక పూజలు జరిపి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఎమ్మెల్యే అదీప్‌రాజ్‌కు సీనియర్ నాయకులు కాసు అంజిరెడ్డి, కె.వినోద్ స్వాగతం పలికారు. కార్యక్రమంలో రాష్ట్ర సీఈసీ సభ్యుడు పైల శ్రీనివాసరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి చుక్క రామునాయుడు, మండల పార్టీ అధ్యక్షుడు కోన రామారావు, మండల జేసీఎస్ కన్వీనర్ వెన్నల సన్యాసిరావు, డి.వి.రమణ, నాయకులు పైల అప్పలనాయుడు, మేడిశెట్టి ఈశ్వరరావు, రేబాక నరేష్, ఆలయ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

జోరుగా వైఎస్సార్‌సీపీ శ్రేణుల ప్రచారం

సింహాచలం: జీవీఎంసీ 98వ వార్డు అడవివరం దరి టీటీ టవర్ కాలనీలో సోమవారం రాత్రి వైఎస్సార్‌సీపీ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. మే 13న జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై రెండు ఓట్లు వేసి విశాఖ ఎంపీగా బొత్స ఝాన్సీలక్ష్మిని, భీమిలి ఎమ్మెల్యేగా ముత్తంశెట్టి శ్రీనివాసరావును గెలిపించాలని కోరారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందించిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. 98వ వార్డు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు కొలుసు ఈశ్వరరావు, ఇన్‌చార్జి ఎర్ర వరహానరసింహం, నాయకులు లండ వెంకటరమణ, టి.రాము, ఎస్.కృష్ణ, వర్మ, ఎన్.అప్పారావు, తెడ్లపు మహేష్ తదితరులు పాల్గొన్నారు.

సేవ చేయలేని కొలువు మాకొద్దు


పెందుర్తి మండలం గొరపల్లి పంచాయతీలో రాజీనామా పత్రాలతో గ్రామ వలంటీర్లు


ఎమ్మెల్యే అదీప్‌రాజ్ సమక్షంలో మూకుమ్మడి రాజీనామాలు చేసిన తానాం వలంటీర్లు

పెందుర్తి, పరవాడ మండలాల్లో 41 మంది వలంటీర్ల రాజీనామా

పెందుర్తి/పరవాడ: అవ్వాతాతలకు ప్రతీ నెల ఒకటో తేదీన పింఛన్ ఇంటికి తీసుకువెళ్లి ఇస్తే ఎంతో సంతోషంగా తీసుకునేవారు. వాళ్ల కళ్లల్లో ఆనందం చూసి సంతృప్తితో మేము వలంటీర్లుగా సేవలందిస్తున్నాం. అలాంటిది ఈ రోజు ఇంకా పింఛన్ ఎందుకు ఇవ్వలేదని అవ్వాతాతలు దీనంగా అడుగుతుంటే గుండె బరువెక్కింది. నడవలేని వాళ్ల పరిస్థితి చూసి సచివాలయానికి వెళ్లి తీసుకోమని చెప్పడానికి కూడా మనసు రాలేదని వలంటీర్లు వాపోయారు. సాయం కోసం ఎదురు చూసే వారికి సేవ చేయలేని కొలువు తమకు వద్దంటూ పెందుర్తి మండలం గొరపల్లిలో 18 మంది, పరవాడ మండలం తానాం పంచాయతీలో 23 మంది వలంటీర్లు సోమవారం తమ కొలువులకు రాజీనామా చేశారు.

వలంటీర్లను వదులుకోను: ఎమ్మెల్యే అదీప్‌రాజ్

సేవను నమ్ముకున్న వలంటీర్లను వదులుకోబోనని ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ చెప్పారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డిపై ఎనలేని అభిమానాన్ని చాటిన వలంటీర్లకు న్యాయం చేస్తామని ఎమ్మెల్యే అదీప్‌రాజ్ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పరవాడ జెడ్పీటీసీ పైల సన్యాసిరాజు, రాష్ట్ర సీఈసీ సభ్యుడు పైల సన్యాసిరాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి చుక్క రామునాయుడు, మండల పార్టీ అధ్యక్షుడు కోన రామారావు, మండల జేసీఎస్ కన్వీనర్ వెన్నల సన్యాసిరావు పాల్గొన్నారు.

రేపటి నుంచి సచివాలయాల్లో పింఛన్ల పంపిణీ


ఎంపీడీవో రామ్మోహనరావు

సబ్బవరం: సచివాలయం కేంద్రంగా ఈ నెల 3వ తేదీ నుంచి పింఛన్లు పంపిణీ చేయనున్నట్టు ఎంపీడీవో ఎస్. రామ్మోహనరావు తెలిపారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు పింఛన్ల పంపిణీ బాధ్యతల నుంచి వలంటీర్లను దూరం పెట్టినట్టు తెలిపారు. గ్రామ సచివాలయంలో పంచాయతీ కార్యదర్శి,వెల్ఫేర్ అసిస్టెంట్‌తో పాటు మిగిలిన సచివాలయ సిబ్బంది పింఛన్లను లబ్ధిదారులకు అందజేస్తారన్నారు. మండలంలోని 20 సచివాలయాల పరిధిలోని 8,364 మంది పింఛన్ దారులకు రూ.2.44 కోట్లు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ఆయనతో పాటు ఏవో ఎస్. బాబూరావు, హౌసింగ్ ఏఈ శేఖర్ ఉన్నారు.

పాలిసెట్ ఉచిత శిక్షణ ప్రారంభం


ఉచిత పాలిసెట్ కోచింగ్‌కు హాజరైన విద్యార్థులు

పెందుర్తి: స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో పాలిసెట్–2024 ఉచిత శిక్షణ తరగతులు సోమవారం ప్రారంభమయ్యాయి. ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్.చంద్రశేఖర్ ఆధ్వర్యంలో 87 మందిని శిక్షణకు ఎంపిక చేశారు. తొలిరోజు తరగతులను ఫిజిక్స్, కెమెస్ట్రీ అధ్యాపకులు వి.ఆర్.ఎల్ మూర్తి, కె.సన్యాసినాయుడు నిర్వహించారు.

ఎన్నికల ప్రచారానికి అనుమతులు తప్పనిసరి

మహారాణిపేట: రాజకీయ పార్టీల నాయకులు ఎన్నికల ప్రవర్తన నియమావళికి లోబడి అనుమతులు తీసుకోవాలని తూర్పు ఎన్నికల రిటర్నింగ్ ఆఫీసర్, జిల్లా జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్ సోమవారం ఓ ప్రకటనలో కోరారు. సమావేశాలు, ఇంటింటి ప్రచారం, ర్యాలీలు, తాత్కాలిక పార్టీ ఆఫీసుల నిర్వహణకు రిటర్నింగ్ అధికారి నుంచి అనుమతి తీసుకోవాలని, లేకపోతే ఎన్నికల ప్రవర్తన నియమావళిని అనుసరించి చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నియమ, నిబంధనల మేరకు ఎన్నికల నిర్వహణకు సహకరించాలన్నారు. ఎన్నికల ప్రవర్తన నియమావళిని పక్కగా అమలు చేయడానికి వివిధ విభాగాలు పని చేస్తున్నాయని పేర్కొన్నారు. ఇప్పటి వరకు ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు 4, ఎంసీసీ బృందాలు 3 కేసులు నమోదు చేశాయన్నారు. పార్టీలు పెడుతున్న ఎన్నికల ఖర్చుల పరిశీలనకు ఒక అధికారి పని చేస్తున్నారన్నారు. సీ–విజిల్ యాప్ ద్వారా గానీ కంట్రోల్ రూమ్ 0891–2746314, 9154405435, 9154405462కి వచ్చిన ఫిర్యాదులను 100 నిమిషాల్లో విచారణ పూర్తి చేయాల్సి ఉందన్నారు. ఇప్పటి వరకు రూ.12.20 లక్షల నగదు, 42 చీరలు, బీఎస్పీకి చెందిన ఒక ప్రచార రథాన్ని సీజ్ చేశామని ఆర్‌వో తెలిపారు.

కాలుష్య రహిత విశాఖ లక్ష్యం


సైకిల్‌పై జీవీఎంసీకి వస్తున్న కమిషనర్ సాయికాంత్‌వర్మ

దాబాగార్డెన్స్: వారంలో ఒక్క రోజు ప్రజా రవాణాను ఉపయోగించి విశాఖను కాలుష్య రహితంగా తీర్చిదిద్దేందుకు నగర ప్రజలు సహకరించాలని జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ కోరారు. తన బంగ్లా నుంచి సోమవారం జీవీఎంసీ ప్రధాన కార్యాలయానికి ఆయన సైకిల్‌పై చేరుకున్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో పెరుగుతున్న కాలుష్య నియంత్రణకు జీవీఎంసీ అధికారులు, ఉద్యోగులు వారంలో ఒక రోజు ప్రజా రవాణాను ఉపయోగిస్తున్నారన్నారు.

దొంగతనాలపై అప్రమత్తంగా ఉండాలి


సీఐ పిన్నింటి రమణ

సబ్బవరం: ప్రజలంతా దొంగతనాలపై అప్రమత్తంగా ఉండాలని సీఐ పిన్నింటి రమణ కోరారు. చెడ్డీ గ్యాంగ్ పలు ప్రాంతాల్లో సంచరిస్తున్న నేపథ్యంలో ప్రజలను అప్రమత్తం చేస్తున్నామన్నారు. గ్రామాల్లో ఆటోల ద్వారా మైక్ అనౌన్స్‌మెంట్ చేయిస్తూ విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నట్టు చెప్పారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలంతా వేసవికాలం కావడంతో ఉక్కబోతకు ఆరుబయట నిద్రించే అవకాశం ఉంటుందన్నారు. ఇదే అవకాశంగా దొంగలు చెలరేగే అవకాశం ఉన్న నేపథ్యంలో పలు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ఇళ్లల్లో తక్కువ డబ్బులు ఉండే విధంగా చూసుకోవడంతో పాటు విలువైన బంగారు ఆభరణాలు ఇంట్లో ఉంచుకోకుండా భద్రపరుచుకోవాలన్నారు. అపరిచిత వ్యక్తులు గ్రామాల్లో సంచరిస్తే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. అలాగే ప్రస్తుతం నగదు రహిత లావాదేవీలు అధికంగా జరగుతుండడంతో సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. ఓటీపీలు,మొబైల్‌లో వచ్చే పలు రకాల లింక్‌లపై క్లిక్ చేసే సమయంలో జాగ్రత్తగా వ్యవహరించాలని సూచించారు.

నిబంధనలు పాటించాలి

రోడ్డు ప్రమాదాల కట్టడికి ప్రతి ఒక్కరూ నిబంధనలు పాటించాలని కోరారు. లేని పక్షంలో చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పరిమితికి మించి వేగంగా వాహనాలు నడిపినా,పరిమితికి మించి వాహనాల్లో ప్రయాణికులను ఎక్కించినా చర్యలు తప్పవన్నారు.

'కేంద్ర ప్రభుత్వ తీరు అమానుషం'


దీక్షలో పాల్గొన్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: విశాఖ ఉక్కు పరిశ్రమపై కేంద్ర ప్రభుత్వ తీరు అమానుషమని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు అన్నారు. కార్మిక వర్గాన్ని నిర్వీర్యం చేస్తున్న నరేంద్ర మోదీ ప్రభుత్వానికి ప్రజలు తగిన గుణపాఠం నేర్పే సమయం ఆసన్నమైందన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలి వద్ద నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షలు సోమవారం నాటికి 1145వ రోజుకు చేరుకున్నాయి. దీక్షల్లో సంస్థకు చెందిన పలు విభాగాల కార్మికులు, ఉక్కు నిర్వాసితులు కూర్చున్నారు. ఈ సందర్భంగా పోరాట కమిటీ నాయకులు మాట్లాడుతూ కార్మికులు నిరంతరాయంగా దీక్షలు చేస్తున్నా కేంద్ర ప్రభుత్వానికి చీమ కుట్టినట్లయినా లేకపోవడం దురదృష్టకరమన్నారు. కార్మికుల ప్రాణత్యాగాలతో ఏర్పాటైన విశాఖ ఉక్కు పరిశ్రమను కారుచౌకగా కార్పొరేట్ కంపెనీలకు కట్టబెట్టే ప్రయత్నాలను కేంద్ర ప్రభుత్వం విరమించుకోవాలన్నారు. ప్లాంట్ ప్రైవేటీకరణ విషయంలో కేంద్రం తన నిర్ణయాన్ని విరమించుకోవాలని, లేదంటే తీవ్ర పరిణామాలు ఎదుర్కోక తప్పదని అన్నారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

పాలిటెక్నిక్‌తో ఉద్యోగావకాశాలు


పాలిసెట్ ఉచిత శిక్షణ తరగతుల్లో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ నారాయణరావు

మురళీనగర్: పదో తరగతి అనంతరం పాలిటెక్నిక్ విద్యను అభ్యసించిన వారికి విస్తృతమైన ఉద్యోగావకాశాలు ఉన్నాయని కంచరపాలెం పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.నారాయణరావు అన్నారు. కాలేజీలో నిర్వహిస్తున్న పాలిసెట్ ఉచిత శిక్షణ తరగతులను సోమవారం ఆయన ప్రారంభించిన అనంతరం ప్రసంగించారు. పాలిటెక్నిక్ పూర్తి కాగానే కనీస రూ.3.50 లక్షల వార్షిక ప్యాకేజీతో ఉద్యోగాలు వస్తాయన్నారు. వీరు ఈసెట్ రాసి నేరుగా ఇంజినీరింగ్ రెండో సంవత్సరం కోర్సులో చేరవచ్చని వివరించారు. విద్యార్థులు శిక్షణ తరగతులకు ప్రతి రోజు హాజరై మంచి ర్యాంకులు సాధించాలని ఆయన సూచించారు. శిక్షణ తరగతులకు 165 మంది హాజరయ్యారు. వీరిలో 72 మంది బాలికలు ఉన్నారు. మొత్తం విద్యార్థులను రెండు బ్యాచీలుగా విభజించి కోచింగ్ ఇస్తున్నట్లు శిక్షణ తరగతులు పర్యవేక్షకుడు, జనరల్ సెక్షన్ హెడ్ డాక్టర్ పీఎం బాషా చెప్పారు. కార్యక్రమంలో అధ్యాపకులు పాల్గొన్నారు.

నగరంలో ముమ్మర తనిఖీలు


రైల్వే స్టేషన్‌లో ప్రయాణికుల లగేజీలను డాగ్ స్క్వాడ్‌తో తనిఖీ చేస్తున్న సెబ్ సిబ్బంది

తాటిచెట్లపాలెం : సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా నగరంలో తనిఖీలు ముమ్మరం చేశారు. స్పెషల్ ఎన్ఫోర్స్‌మెంట్ బ్యూరో అడిషనల్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ బి.శ్రీనివాసరావు ఆదేశాలతో సెబ్ అసిస్టెంట్ ఎన్ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ సుబ్బారావు ఆధ్వర్యంలో సోమవారం విశాఖపట్నం రైల్వేస్టేషన్‌తో పాటు పరిసర ప్రాంతాల్లో డాగ్ స్క్వాడ్‌తో తనిఖీలు చేశారు. ఈ తనిఖీల్లో సెబ్ సిబ్బంది రాజుల నాయుడు, ముసలనాయుడు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

'స్టీల్‌ప్లాంట్ కార్మికులకు జీతాలు చెల్లించాలి'


స్టీల్‌ప్లాంట్ సీజీఎం సోబ్తీతో చర్చిస్తున్న ఐఎన్‌టీయూసీ నాయకులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ కార్మికులకు వెంటనే జీతాలు చెల్లించాలని స్టీల్ ఐఎన్‌టీయూసీ నాయకులు డిమాండ్ చేశారు. యూనియన్ అధ్యక్షుడు నీరుకొండ రామచంద్రరావు నేతృత్వంలో నాయకులు సోమవారం స్టీల్‌ప్లాంట్ సీజీఎం (వర్క్స్) ఎ.కె. సోబ్తీని కలిసి జీతాలపై చర్చించారు. కష్టపడి పనిచేసే కార్మికులకు జీతాలు ఇవ్వకపోవడం యాజమాన్యం వైఫల్యానికి నిదర్శనమన్నారు. ఉద్యోగులకు క్యాంటీన్ సదుపాయం నిలిపి వేయడం దుర్మార్గమన్నారు. దీనిపై సోబ్తీ మాట్లాడుతూ సాయంత్రానికల్లా క్యాంటీన్ సమస్య పరిష్కరిస్తామని నాయకులకు చెప్పారు. జీతాల అంశంపై స్పష్టమైన హామీ ఇవ్వకుండా దాటవేయడంపై నాయకులు అభ్యంతరం తెలిపారు.